


నేత్రదానం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని బొర్రంపాలెం గ్రామానికి చెందిన వీరమల్లు సూర్యారావు శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. మరొకరికి చూపునిచ్చేందుకు సూర్యారావు నేత్రాలను దానం చేయడానికి కుటుంబ సభ్యులు భార్య వీరమ్మ, కుమారులు సత్యనారాయణ, వెంకటేశ్వరరావులు ఒప్పుకున్నారు. విజయవాడ ఎల్‌వి ప్రసాద్ ఆసుపత్రివారు సూర్యారావు నేత్రాలను సేకరించారు. మృతి చెందిన ప్రతిఒక్కరి నేత్రాలను దానం చేయటానికి ముందుకు రావాలని ఆయన కోరారు. నేత్రదానం చేయడం ద్వారా 16 ఏళ్ల లోపు నలుగురు అంధులకు చూపును ఇచ్చే అవకాశం ఉంటుందని ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్యాలయం టెక్నీషియన్స్ సుధారాణి, హరికృష్ణ తెలిపారు.



సూర్యారావు (ఫైల్‌ఫోటో)

ఊరూ.. వాడా 'బెల్టు'షాపులే..!

విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
ప్రతి గ్రామంలోనూ రెండుకుపైగా బెల్టు దుకాణాలు
క్వార్టర్ బాటిల్‌కు రూ.20 వరకూ అదనంగా వసూలు
కొన్నిచోట్ల లైసెన్స్ షాపుల తరహాలో ఏర్పాట్లు
ఏలూరు జిల్లాలో నెలకు రూ.వంద కోట్లు, పశ్చిమలో అంతకు మించి మద్యం విక్రయాలు
దుకాణాల్లో ఎంఎల్‌ఎలకు వాటాలుండటంతో అడిగే నాథుడే కరువు
పర్మిట్లు లేకపోయినా సిట్టింగ్ ఏర్పాటు చేసి మరీ అమ్మకాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మద్యం విక్రయాలకు సంబంధించి ప్రభుత్వం చెబుతున్నదానికి.. క్షేత్రస్థాయిలో జరుగుతున్న దానికి సంబంధం లేకుండాపోయింది. లైసెన్స్ దుకాణాలకు అదనంగా వందల సంఖ్యలో బెల్టుషాపుల్లో నిత్యం మద్యం విక్రయాలు సాగుతున్నాయి. ప్రతి గ్రామంలోనూ రెండు, అంతకుమించి బెల్టు షాపులు నడుస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. కొన్ని గ్రామాల్లో ప్రాంతాలవారీగా బెల్టు షాపులు సైతం ఏర్పాటు చేసిన పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత కొత్త మద్యం పాలసీని తెచ్చింది. టెండర్ల ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు చేపట్టింది. 2024 అక్టోబర్‌లో ఈ ప్రక్రియను పూర్తి చేసింది. ఏలూరు జిల్లాలో 144, పశ్చిమలో 175 మద్యం దుకాణాలకు లైసెన్స్‌లు ఇచ్చింది. గీత కార్మికులకు కొన్ని దుకాణాలను కేటాయించింది. మద్యం దుకాణాల్లో స్థానిక ఎంఎల్‌ఎలకు పెద్దఎత్తున వాటాలు



ఉండటంతో అమ్మకాలపై నియంత్రణ అనేది పూర్తిగా లేకుండాపోయింది. ఎంఎల్‌ఎల కనుసన్నల్లో మద్యం దుకాణాలు నడుస్తుండటంతో ఎక్సైజ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేని పరిస్థితి నెలకొంది. ప్రతి లైసెన్స్ దుకాణానికి అనుబంధంగా పెద్దఎత్తున బెల్టుషాపులు నడుస్తున్నాయి. ఈ దుకాణాలు సైతం కూటమి పార్టీలకు సంబంధించిన అనుయాయుల చేతుల్లోనే ఉన్నాయి. ప్రతి గ్రామంలోనూ రెండుకుపైగా బెల్టుషాపులు ఉన్నాయి. లైసెన్స్‌డ్ షాపుల నుంచి బాటిళ్లు తీసుకెళ్లి బెల్టు షాపుల్లో విక్రయాలు సాగిస్తున్న పరిస్థితి ఉంది. బెల్టు షాపుల్లో క్వార్టర్ బాటిల్‌కు రూ.20 అదనంగా ధర నిర్ణయించి విక్రయిస్తున్నారు. దూరంగా ఉన్న మద్యం దుకాణాలకు వెళ్లలేక మందుబాబులు అత్యధికంగా బెల్టుషాపులలోనే మద్యం కొనుగోలు చేస్తున్నారు. చిన్నస్థాయి బెల్టు దుకాణంలో సైతం రోజుకు 50 బాటిళ్లు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని బెల్టు దుకాణాల్లో వందల బాటిళ్ల విక్రయాలు సాగుతున్నాయి. కొన్నిచోట్ల బెల్టు దుకాణాలను సైతం లైసెన్స్ షాపుల తరహాలో ఏర్పాటు చేసి విక్రయాలు సాగించేస్తున్నారు. ఇదంతా బహిరంగంగా జరుగుతున్నా అధికారులు కనీస చర్యలు తీసుకోని పరిస్థితి ఉంది. ఏలూరు జిల్లాలో నెలకు రూ.90 నుంచి రూ.వంద కోట్లు మద్యం అమ్మకాలు సాగుతున్నాయంటే ఆశ్చర్యపోక తప్పదు. ప్రతి నెలా లక్షా నుంచి లక్షా 30 వేల మద్యం కేసుల విక్రయాలు సాగుతున్నాయి. ఒక్కో కేసులో 48 క్వార్టర్ బాటిళ్లు ఉంటాయి. 70 వేల వరకూ బీర్ కేసులు అమ్మకాలు చేస్తున్నారు. ఇక పశ్చిమలో లైసెన్స్ దుకాణాలు ఎక్కువగా ఉన్నాయి. బెల్టుషాపులు సైతం పెద్దఎత్తున సాగుతున్నాయి. దీంతో ఏలూరు జిల్లాకు మించి పెద్దఎత్తున అమ్మకాలు సాగుతున్నాయి. యువతను పూర్తిగా మద్యం మత్తులోకి నెట్టేస్తున్న పరిస్థితి ఉంది. ఇదంతా ఒక పథకం ప్రకారమే జరుగుతుందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.

పర్మిట్లు లేకుండానే సిట్టింగ్ అమ్మకాలు

నిబంధనల ప్రకారం మద్యం లైసెన్స్ దుకాణాల వద్ద మద్యం బాటిళ్ల విక్రయాలు మాత్రమే సాగాలి. పర్మిట్లకు అనుమతిస్తేనే అక్కడ కూర్చుని తాగే (సిట్టింగ్) ఏర్పాటు చేయాలి. పర్మిట్లు లేకపోయినా మద్యం దుకాణాల వద్ద సిట్టింగ్ ఏర్పాటు చేసి మరీ మద్యం అమ్మకాలు సాగించేస్తున్నారు. ప్రతి మద్యం దుకాణంలోనూ ఎంఎల్‌ఎలు, వారి అనుయాయులకు వాటాలు ఉండటంతో ఎక్సైజ్ అధికారులు పట్టించుకోని పరిస్థితి ఉంది. పట్టణాల్లో యథేచ్ఛగా ఈ ప్రక్రియ సాగుతున్నా ఏఒక్కరికీ పట్టడం లేదు. పలు దుకాణాల్లో ఎంఆర్‌పికి మించి మద్యం విక్రయాలు సాగిస్తున్నా అడిగే నాథుడే కరువయ్యాడు. రాత్రి పది గంటలకు మద్యం దుకాణాలు మూసివేయాల్సి ఉన్నప్పటికీ చాలాచోట్ల రాత్రి 11 గంటలు, 12 గంటల వరకూ సైతం మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలు ఏఒక్కటీ మద్యం అమ్మకాల్లో అమలు కావడం లేదు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడానికి మద్యం దోపిడీ సైతం ప్రధాన కారణంగా కన్పిస్తోంది. బెల్టుషాపులు ఏమీ లేవంటూ ఎక్సైజ్ అధికారులు మసిపూసి మారేడు కాయ చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఎక్కడ బెల్టుషాపు ఉందో అధికారులకు తెలిసినా ఎటువంటి చర్యలూ లేకుండాపోయాయి. ఎంఎల్‌ఎల ఆధ్వర్యంలో మద్యం దుకాణాలు నడుస్తుండటమే దీనికి ప్రధాన కారణంగా చెప్పొచ్చు. వైసిపి ప్రభుత్వంలో మద్యం దోపిడీ ఒకలా ఉంటే.. కూటమి ప్రభుత్వంలో మరోలా కొనసాగుతుందని, పెద్దగా తేడా కనిపించడం లేదనే అభిప్రాయం జనాల్లో వ్యక్తమవుతోంది.

9న ఏలూరులో 'షైనింగ్ స్టార్స్'

పది, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సత్కారం: కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు



జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పదో తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన వారిని 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమం ద్వారా సన్మానించి, నగదు పురస్కారం అందించనున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమి సమావేశపు హాలులో 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమం నిర్వహణపై అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పదో తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన వారిని 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమం ద్వారా సన్మానిస్తామని, ఈ కార్యక్రమం ఈ నెల 9వ తేదీ ఉదయం 9.30 గంటలకు ఏలూరులోని సిఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కాలేజీ ఆవరణలో నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా మంత్రులు కొలుసు పార్థసారధి, ఎంఎల్‌ఎలు, ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. కార్యక్రమ నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని డిఇఒను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో 83.33 శాతం అంతకు మించి మార్కులు సాధించిన వారిలో మండలం నుండి ఆరుగురు చొప్పున 163 మంది విద్యార్థినీ విద్యార్థులను ఎంపిక చేశారని, జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలో అత్యు త్తమ మార్కులు సాధించిన 34 మంది విద్యార్థినీ విద్యార్థులకు సర్టిఫికెట్, రూ.20 వేల నగదు బహుమతి అందించడం జరుగుతుందన్నారు. సమావేశంలో డిఇఒ వెంకటలక్ష్మమ్మ, సర్వశిక్షా అభియాన్ ఎపిసి పంకజ్ కుమార్, విద్యాశాఖ ఎడి ఎం.వెంకటప్పయ్య, ఇరిగేషన్ ఎస్‌ఇ నాగార్జునరావు, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

రాష్ట్రస్థాయిలో జిల్లాకు 11, 17వ స్థానాలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ-2025 పరీక్షా ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో ఏలూరు జిల్లా మొదటి సంవత్సరం ఫలితాల్లో సాధారణ విభాగంలో రాష్ట్రస్థాయిలో 11వ స్థానంలో నిలువగా, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 17వ స్థానంలో నిలిచింది. వృత్తి విద్యా విభాగంలో మొదటి సంవత్సరం జిల్లా రాష్ట్ర స్థాయిలో 11వ స్థానంలో ఉండగా, ద్వితీయ సంవత్సరం 19వ స్థానంలో నిలిచింది. బాలురు 50 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలికలు 55 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో 7,267 మందికి 3,769 మంది ఉత్తీర్ణత సాధించగా 3,498 మంది ఫెయిలయ్యారు. 52 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం మొత్తం 4,545 మందికి 2,146 మంది ఉత్తీర్ణత సాధించారు. 47 శాతం ఉత్తీర్ణత నమోదైంది. వీరిలో సాధారణ విద్యార్థులు 3,877 మందికి 1,787 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే వృత్తి విద్యా విభాగంలో 668 మందికి 359 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో మొత్తం 2,722 మందికి 1,623 మంది ఉత్తీర్ణత సాధించారు. 60 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇందులో సాధారణ విభాగంలో 2,261 మందికి 1,350 మంది ఉత్తీర్ణత సాధించారు. వృత్తి విద్యా విభాగంలో 461 మందికి 273 మంది ఉత్తీర్ణత సాధించారు. యాజమాన్యాలవారీగా చూస్తే జిల్లాలో కస్తూరిబా గాంధీ విద్యాలయాలు నూరుశాతం ఉత్తీర్ణత సాధించగా, రెండో స్థానంలో సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలు 63 శాతం ఉత్తీర్ణత సాధించాయి. 32 శాతం ఉత్తీర్ణతతో హైస్కూల్ ప్లస్ పాఠశాలలు చివరి స్థానంలో నిలిచాయి.

జిల్లా, నియోజకవర్గాల అభివృద్ధి ప్రణాళికలు ఇవ్వాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశం

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాను రాష్ట్రస్థాయిలో అభివృద్ధిపథంలో నిలిపేలా ఏలూరు జిల్లా, నియోజకవర్గాలవారీగా అభివృద్ధిపై కార్యాచరణ ప్రణాళికలను వెంటనే సమర్పించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశపు హాలులో శనివారం జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధిపై కార్యాచరణ ప్రణాళికల రూపకల్పనపై అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యాలకు అనుగుణంగా జిలాల్లోని అసెంబ్లీ నియోజకవర్గాలస్థాయిలో వ్యవసాయం, అనుబంధ రంగాలు, పారిశ్రామికాభివృద్ధి తదితర రంగాల్లో సుస్థిరాభివృద్ధికి నిర్దేశించిన లక్ష్యాలతో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి సమర్పించాలన్నారు. జిల్లాలో విస్తృతంగా లభిస్తున్న వనరులు, ఆహార, ఉద్యాన రంగాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు అనుకూల పరిస్థితులు తదితర అంశాలను ప్రణాళికలో పొందుపర్చాలన్నారు.

జిల్లా, నియోజకవర్గాల అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికలను సిఎంకు సమర్పించాల్సి ఉన్నందున ప్రణాళికలను వెంటనే రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్‌ఇ నాగార్జునరావు, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, జిల్లా సహకార అధికారి ఎ.శ్రీనివాస్, డిఇఒ వెంకటలక్ష్మమ్మ, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ఎం.ముక్కంటి, వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఆర్‌వి.నాగరాణి, డిఎస్‌ఒ శివరామ్మూర్తి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ త్రినాధ్‌బాబు, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ పీడీ రవికుమార్ పాల్గొన్నారు.

యోగాను ప్రజలకు చేరువ చేయాలి: కలెక్టర్

జిల్లాలో యోగాను ప్రజలకు మరింత చేరువ చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమి సమావేశపు హాలులో శనివారం జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాలపై అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్య ప్రయోజనాలు అందించే యోగాను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 9వ తేదీ ఉదయం ఏడు గంటలకు ఏలూరులో సిఆర్‌రెడ్డి పబ్లిక్ స్కూల్ నుండి ఇండోర్ స్టేడియం వరకు యోగాంధ్రపై అవగాహనా ర్యాలీ నిర్వహించాలన్నారు. 10వ తేదీన జంగారెడ్డిగూడెంలో మద్ది ఆంజనేయస్వామి గుడి వద్ద, 18న జీలకర్రగూడెంలోని గుంటుపల్లి గుహల వద్ద యోగాభ్యాసన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 13న ఏలూరులోని సర్ సిఆర్‌రెడ్డి డిగ్రీ కళాశాల గ్రౌండ్స్‌లో జిల్లాస్థాయిలో యోగాభ్యాసన కార్యక్రమం నిర్వహించాలని, దీనికి రాష్ట్రమంత్రులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమాల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఆస్తి పన్ను పెంపు సరికాదు

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

కూటమి ప్రభుత్వం సామాన్యులపై ఆస్తి పన్ను భారం పెంచడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సుందరయ్య భవనంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పాలకుల కంటే మరో ఐదు శాతం అదనంగా ఆస్తి పన్ను పెంచేలా కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు సాగిస్తుందన్నారు. ఎన్నికల ముందు పన్నుల భారాన్ని తగ్గిస్తామని చెప్పిన కూటమి నేతలు, అధికారంలోకొచ్చాక భారాలు తగ్గించకపోగా మరిన్ని భారాలు మోపడం దారుణమని విమర్శించారు. ప్రజలను మోసగించిన ఏ పాలకులూ అధికారంలో కొనసాగలేదని చరిత్ర చెబుతోందన్నారు. భారాలు ఇలానే కొనసాగిస్తే గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికీ తప్పదని రాజు హెచ్చరించారు. ఒక్క ఏలూరు జిల్లాలోనే మూడు మున్సిపాల్టీలు, ఒక కార్పొరేషన్ పరిధిలో ప్రజలపై సుమారు రూ.11 కోట్లు అదనపు భారం పడనుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అదనపు పన్నుల భారాన్ని ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు మరియదాసు, శోభనాద్రి, వసంతరావు పాల్గొన్నారు.

ఎస్‌జిటిలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

డిఇఒకు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకుల వినతి, పలుచోట్ల నిరసనలు



డిఇఒకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా మాత్రమే బదిలీ ప్రక్రియ చేపట్టాలని జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మను శనివారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాన్యువల్ కౌన్సెలింగ్ చేపట్టని పక్షంలో ఎనిమిదో తేదీ ఆదివారం ఉదయం ఏలూరు డిఇఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు శామ్యూల్, సాంబశివరావు, రవికుమార్, కమల్, మోహన్, ఆంజనేయులు, ధర్మారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముసునూరు : ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలకు ఇచ్చిన హామీలకు విభిన్నంగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించడం సరికాదని ఉపాధ్యాయ ఐక్యవేదిక నాయకులు అన్నారు. ఈ మేరకు ఎంఇఒ కార్యాలయం వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌జిటిలకు మ్యానువల్ కౌన్సెలింగ్ పెట్టే వరకూ పోరాటం ఆగదన్నారు. అన్ని ఉపాధ్యాయ సంఘాలు కలిసి భవిష్యత్తులో ధర్నాలు, నిరసనలు చేయడానికైనా సిద్ధమేనని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘ నాయకులు, సభ్యులు జి.పద్మకిషోర్, కాసాని గాంగేయుడు, దేవరపల్లి బెనర్జీ, కొప్పుల బాబూరావు, కాలి విల్సన్, గుడిమేళ్ల రాంబాబు, బురుగు సుకుమార్, సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.



ముసునూరులో...

ఉంగుటూరు : యుటిఎఫ్ మండల శాఖ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపుమేరకు ఉంగుటూరు ఎంఇఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉనుముల రాంబాబు, డాకి జోగినాయుడు మాట్లాడుతూ వెబ్ కౌన్సెలింగ్ వద్దని, మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సీతాల సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి పుప్పాల నరసింహారావు, ఉపాధ్యక్షులు తూతిక శివయ్య, జిల్లా కౌన్సిలర్లు అల్లు శ్రీను, బొమ్మిడి ప్రసాద్, సలాది గణేష్, కళ్లపల్లి పోతురాజు, తీడ శ్రీధర్, సింగవరపు శ్రీను, సురేష్, రేగాన రామకృష్ణ, దామోదర్, పివి.సత్యనారాయణ పాల్గొన్నారు.



ఉంగుటూరులో...

ఐదుగురు తహశీల్దార్ల బదిలీ

14 మంది డిప్యూటీ తహశీల్దార్లకు స్థానచలనం


ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెవెన్యూ శాఖలో బదిలీల పర్వం కొనసాగింది. ముఖ్యంగా మండలాల్లో కీలకంగా వ్యవహరించే తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్, సీనియర్ అసిస్టెంట్ల బదిలీలు జరిగాయి. బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు శనివారం జిల్లా కలెక్టరేట్ అధికారులు విడుదల చేశారు. జిల్లావ్యాప్తంగా మొత్తం ఐదుగురు తహశీల్దార్లు బదిలీ అయ్యారు. కొయ్యలగూడెం తహశీల్దార్ కె.చెల్లన్నదొర కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. ఏలూరు రూరల్ మండల తహశీల్దార్‌గా జి.విజయ్‌కుమార్‌రాజు నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఈయన కలెక్టరేట్‌లోని ల్యాండ్ రికార్డ్స్ విభాగంలో స్పెషల్ తహశీల్దార్ ఎఒగా పని చేస్తూ తహశీల్దార్‌గా నియమితులయ్యారు. కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న పి.రవికుమార్‌ను మేజిస్టీరియల్ సెక్షన్ స్పెషల్ తహశీల్దార్‌గా, కలెక్టరేట్‌లో పని చేసే ఎమ్‌డి.నజీముల్లా షాను లింగపాలెం తహశీల్దార్‌గా, ఏలూరు అర్బన్ తహశీల్దార్ జివి.శేషగిరిని కలెక్టరేట్ ల్యాండ్ మేటర్స్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. తహశీల్దార్లతోపాటు 14 మంది డిప్యూటీ తహశీల్దార్లను, మరో 14 మంది సీనియర్ అసిస్టెంట్లను వివిధ స్థానాలకు బదిలీ చేశారు. బదిలీ ఉత్తర్వులు అందుకున్న అధికారులు వెంటనే ఆయా స్థానాల్లో చేరాల్సి ఉంది. తహశీల్దార్ల బదిలీలు ముగిసినట్టేనా.. మరిన్ని మార్పులు ఉంటాయా అనేది స్పష్టత లేదు.

యోగా సరే.. సమస్యల మాటేంటి?

మరికొద్ది రోజుల్లో విద్యాసంస్థలు తెరుచుకోనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఇప్పటికే ఫీజుల మోత మోగించడంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల అమ్మకాలు బహిరంగంగానే కానిచ్చేస్తున్నాయి. మరోపక్క ఖరీఫ్ సాగు పనులు ప్రారంభించాల్సి ఉంది. కాల్వలకు నీరు విడుదల చేసినా చాలాచోట్ల నిర్వహణా పనులు తదితర కారణాల రీత్యా కాల్వలకు నీరు రాని పరిస్థితి. ఖరీఫ్ సాగుకు సంబంధించి రుణ వితరణ తదితర అంశాలపై ఇప్పటి వరకూ జిల్లా అధికారులు దృష్టి సారించకపోవడం విస్మయం కల్గిస్తోంది. అంతా యోగాపై హడావిడి తప్ప జనం పాట్లుపై పాలకులు, అధికారులు దృష్టి సారించడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి.

రెండు జిల్లాల్లో జిల్లా నుంచి మండలస్థాయి వరకూ అధికారులంతా యోగా కార్యక్రమాల నిర్వహణలో తలమునకలయ్యారు. దానికి ప్రాధాన్యతను ఇవ్వడాన్ని ఎవరూ తప్పుబట్టరు. అయితే కాలగమనంలో కొన్ని పనులు నిర్దిష్ట సమయంలో చేయకపోతే వచ్చే నష్టం ఎక్కువేనని అందరికీ తెలిసిందే. అందులో ఖరీఫ్ సాగు పనులు చాలా ముఖ్యమైనవి. జూన్ ఒకటో తేదీన ఆర్భాటంగా కాల్వలకు నీళ్లు విడుదల చేశారు. అయితే కాల్వల్లో నీళ్లు కానరాకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. నీళ్లు విడుదల చేసి వారం రోజులైనందున ప్రతికాల్వలో ఎంతోకొంత నీళ్లుండటం సహజం. అయితే కాల్వల నిర్వహణ పనులు మే నెలాఖరున చేపట్టడంతో కాల్వలకు నీరు విడుదల పూర్తిస్థాయిలో చేపట్టలేదనేది బహిరంగ రహస్యం. ఇక్కడే పాలకుల చిత్తశుద్ధి ఏమిటో తెలుస్తోంది. ఏప్రిల్‌లోనే కాల్వలు మూసేసినా వెనువెంటనే పనులు చేపట్టని ఫలితంగా ఇప్పుడు కాల్వలకు నీరు విడుదల చేయలేని దుస్థితి దాపురించింది. ఇక ఎండలు మండిపోతుండటంతో రైతులు సైతం ఖరీఫ్ నారుమళ్ల పనులు ప్రారంభించడానికి వెనుకాడుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా



అధికారులు రైతులకు అవసరమైన విత్తనాలు పంపిణీ చేయడం, నీటి సమస్యను అధిగమించి పనులు చేపట్టడం, అవసరమైన రుణ వితరణ చేపట్టడం వంటి చర్యలు చేపట్టాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకూ జిల్లా అధికారులు ఖరీఫ్ సాగుపై సమీక్షించకపోవడం, ఆపై చర్యలు చేపట్టకపోవడం రైతులను ఆవేదనకు గురిచేస్తోంది.

ఇక విద్యాసంస్థలు వచ్చే వారంలో తెరుచుకోనున్నాయి. ఇప్పటికే ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు అడ్మిషన్ల ప్రక్రియ దాదాపు పూర్తి చేశాయి. ఫీజుల మోత మోగుతున్నా విద్యాశాఖాధికారులు అటువైపు కన్నెత్తి చూసే పరిస్థితి లేదు. అదేక్రమంలో పుస్తకాల వ్యాపారం పెద్దఎత్తున విద్యాసంస్థలే నిర్వహిస్తుండటం గమనార్హం. దీనిపై ఎస్‌ఎఫ్‌ఐ తదితర విద్యార్థి సంఘాలు అభ్యంతరం చెప్పి పుస్తకాల విక్రయాలను అడ్డుకోవడమే కాకుండా అధికారులకు ఫిర్యాదు చేసిన ఘటనలు ఉన్నాయి. అయితే దీనిపై అధికారుల స్పందన చాలా నామమాత్రంగా ఉండటం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇటు ఆకివీడు, నిడమర్రు తదితర ప్రాంతాల్లో ఇప్పటికే పుస్తకాల అక్రమ విక్రయంపై ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. కేవలం ఎంఇఒ కార్యాలయాల్లో ఉండే దిగువస్థాయి సిబ్బందిని పంపి ఆయా గదులకు తాళాలు వేయించడం మినహా ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. ఇప్పటికైనా జిల్లా అధికారులు రంగంలోకి దిగి అటు ఖరీఫ్ సాగుకు అవసరమైన చర్యలు చేపట్టడంతోపాటు రైతుకు వెన్నుదన్నుగా ఉండేలా రుణాల మంజూరుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. అదే క్రమంలో విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీపై ప్రత్యేక కేంద్రీకరణ చేసి అక్రమ పుస్తకాల వ్యాపారం వంటి వాటిని నిరోధించాలి. లేనిపక్షంలో అటు రైతులు, ఇటు విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. మరి పాలకులేమో నామినేటెడ్ పదవులపై, అధికారులేమో యోగాపై తలమునకలై ఉన్నారనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ రెండింటిపై దృష్టి సారించాలని రెండు జిల్లాల ప్రజలు కోరుతున్నారు.

- వివిఎస్‌ఎస్‌వి.ప్రసాద్

మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి
'నాషా ముక్త్ భారత్'లో భాగంగా ఇంటర్ డిపార్ట్‌మెంటల్ క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరును మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యమని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. నాషా ముక్త్ భారత్ అభియాన్ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఏలూరు ఆశ్రం మెడికల్ కళాశాల క్రికెట్ మైదానంలో రెండు రోజుల పాటు జరుగుతున్న ఇంటర్ డిపార్ట్‌మెంటల్ క్రికెట్ పోటీలను ఆమె శనివారం ప్రారంభించారు. అనంతరం ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడిన కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ క్రీడాకారులను ప్రోత్సహించారు. తొలుత పోటీలో పాల్గొంటున్న ఆరు జట్ల క్రీడాకారులను కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ పరిచయం చేసుకున్నారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలను ప్రజలకు వివరించడంతో పాటు మాదక ద్రవ్యాల అమ్మకం, రవాణా వంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం నషాముక్త్ భారత్ అభియాన్ ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారాన్ని 1972, 14446 టోల్ ఫ్రీ నెంబర్లకు అందించాలన్నారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా ఉండేలా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల వినియోగం కారణంగా కలిగే దుష్ప్రభావాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం అందరి బాధ్యతని పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల బారిన పడకుండా యువతను వివిధ క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకునేలా చైతన్య పరచాలన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామని, గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలు రవాణా చేసే వారిపై కఠినమైన శిక్షలు పడేలా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మీడియా, రెవెన్యూ జట్ల మధ్య తొలి మ్యాచ్ నిర్వహించగా టాస్ గెలిచి రెవెన్యూ టీమ్ ఫీల్డింగ్ ఎంచుకుంది. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి.రామ్‌కుమార్, డిఎస్‌డిఒ బి.శ్రీనివాసరావు, సెట్‌వెల్ సిఇఒ ప్రభాకర్, ఎన్‌జిఒ నాయకులు చోడగిరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

9న కలెక్టరేట్ వద్ద ధర్నాకు సంపూర్ణ మద్దతు : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

50 శాతం పామాయిల్ దిగుమతులపై సుంకం పెంచి ఆయిల్‌పామ్ రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల తొమ్మిదో తేదీన కలెక్టరేట్ వద్ద ఆయిల్‌పామ్ రైతులు నిర్వహిస్తున్న ధర్నాకు సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ముడి పామాయిల్ దిగుమతి సుంకం పది శాతం తగ్గించడం వల్ల ఆయిల్‌పామ్ గెలల ధరలు ఆకస్మికంగా తగ్గిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చుల రీత్యా టన్ను ఆయిల్‌పామ్ గెలలకు రూ.22 వేల ధర కల్పించాలని పేర్కొన్నారు. ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకం 50 శాతం పెంచాలని తెలిపారు.

జీలుగుమిల్లి : కేంద్ర ప్రభుత్వం పామాయిల్‌పై పది శాతం దిగుమతి సుంకం తగ్గించడంపై ఈ నెల 9న ఏలూరు కలెక్టరేట్ ఎదుట జరిగే ఆయిల్‌పామ్ రైతుల ధర్నాను జయప్రదం చేయాలని ఆయిల్‌పామ్ రైతు సంఘం మండల కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య కోరారు. ఈ మేరకు మండలంలోని ఆయిల్ పామ్ రైతులకు ధర్నాకు సంబంధించిన కరపత్రాలను శనివారం పంపిణీ చేశారు.

వాటర్‌ట్యాంకుల నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

మండలంలోని మేడేపల్లి, రామవరం పంచాయతీల్లో అల్లూరి నగర్, ఇప్పలగుంపు, మల్లారం, చెరువు గొల్లగూడెం, తెల్లవల్లి గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు సుమారు రూ.కోటితో తాగునీటి ట్యాంకులు నిర్మించనున్నారు. అధికారులు, టిడిపి కూటమి నాయకులు ట్యాంకుల నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రామవరం సర్పంచ్ పిట్ట ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మండలంలోని మేడేపల్లి, రామవరం పంచాయతీలకు ఇంతకుముందు సిమెంట్ రోడ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు గుజ్జు రామలక్ష్మి, ఎంపిపి లక్ష్మీదేవి, ఎంపిడిఒ శ్రీహరి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ జగదీష్, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వేలేరుపాడు ఎస్ఐగా నవీన్‌కుమార్

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్



బాధ్యతలు స్వీకరిస్తున్న నవీన్‌కుమార్

వేలేరుపాడు ఎస్ఐగా నవీన్‌కుమార్ శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకుంటానని, మండలంలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు అయిన పేకాట, గుండాట, కోడిపందేలు, జూదం వంటివాటికి పాల్పడితే వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఆటోడ్రైవర్లందరూ క్రమశిక్షణతో మెలగుతూ ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలని, విధిగా కాకి షర్ట్ ధరించి ఆటోకు సంబంధించిన రికార్డులను ఉంచుకోవాలని, లేకపోతే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన నవీన్‌కుమార్‌కు మండల అధికారులు, నాయకులు, ప్రజలు అభినందనలు తెలిపారు.

50 ఏళ్లు పైబడినవారికి పెన్షన్ అందించాలి

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

సూపర్ సిక్స్ హామీలో భాగంగా 50 ఏళ్ల వయసు పైబడిన ఎస్‌సి, బిసిలకు పెన్షన్ ఇవ్వాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో కెవిపిఎస్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి కె.సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి సంవత్సరం గడుస్తున్నా సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. 50 ఏళ్లు పైబడిన ఎస్‌సి, బిసిలకు పెన్షన్ ఇస్తానన్న వాగ్దానాన్ని తక్షణమే నెరవేర్చాలన్నారు, లేకపోతే రాష్ట్రంలో ఉన్న ఎస్‌సిలను ఐక్యం చేసి పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎ.ధర్మరాజు, శంకరం, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సిఎంఆర్ఎఫ్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

అపత్కాలంలో నిరు పేదలకు మెరుగైన వైద్యం అందించడంలో సిఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆగిరపల్లి మండలంలోని కొత్త ఈదర గ్రామానికి చెందిన డి.రామారావు కుటుంబానికి లక్ష రూపాయాలు, చాట్రాయి మండలం పోతనపల్లి గ్రామానికి చెందిన డి.సావిత్రి కుటుంబానికి రూ,70 వేలు, కామవరపుకోట గ్రామానికి చెందిన కె.వీరయ్య కుటుంబానికి రూ,1.50 లక్షల చొప్పున మొత్తం రూ.3.20 లక్షలు ఎల్‌ఒసి పత్రాలు మంత్రి పార్థసారథి అందించారు.

రెగ్యులేటర్ల నిర్మాణంతోనే అభివృద్ధి

ప్రజాశక్తి - మండవల్లి

కొల్లేరు ప్రాంత ప్రజల అభివృద్ధి రెగ్యులేటర్ల నిర్మాణంతోనే సాధ్యపడుతుందని సామాజికవేత్త ఎల్ఎస్.భాస్కరరావు అన్నారు. మండలంలో విస్తరించిన కొల్లేరులో ప్రస్తుతం ఉన్న పరిస్థితిని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా రెగ్యులేటర్ నిర్మాణం హామీ నెరవేరడం లేదన్నారు. రెగ్యులేటర్ నిర్మాణం చేసి కొల్లేరులో నీరు నిల్వ ఉండేలా చూడాలని ఆయన కోరారు.

డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దు

ప్రజాశక్తి - టి.నర్సాపురం

డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దని ఎస్ఐ ఎం.జయబాబు హెచ్చరించారు. టి.నరసాపురం ప్రధాన సెంటర్‌లో శనివారం వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా లైసెన్స్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్నవారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. కొందరికి ఫైన్ విధించారు. ఆయనతో పాటు హెడ్‌కానిస్టేబుల్ సి.రాజు ఉన్నారు.

నేరాలు - ఘోరాలు

భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని...

ప్రజాశక్తి - ముదినేపల్లి

భార్యాభర్తల మధ్య ఏర్పడ్డ మనస్పర్థల కారణంగా ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని పేరూరు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కృష్ణాజిల్లా బంటుమిల్లి మండలం బండ్లగూడేనికి చెందిన కూర్మా యెహోషువకు పదేళ్ల క్రితం కైకలూరు మండలం కొట్టాడ గ్రామానికి చెందిన సంధ్యతో వివాహమైంది. వీరికి ఒక కుమార్తె ఉంది. యెహోషువ కొంతకాలంగా పేరూరు గ్రామంలో చేపల చెరువుపై ఉంటూ పనులు చేస్తూ తన కుటుంబంతో కలిసి జీవిస్తున్నాడు. సుమారు పది రోజుల క్రితం అతని భార్య సంధ్య కుమార్తెను తీసుకుని ఆమె పుట్టింటికి వెళ్లింది. దీంతో యెహోషువ శుక్రవారం మధ్యాహ్నం కొట్టాడలో ఉన్న భార్య వద్దకు వెళ్లాడు. దీంతో భార్యాభర్తలు మధ్య గొడవ జరిగి కేకలు వేసుకున్నారు. దీంతో మనస్తాపానికి గురైన యెహోషువ తిరిగి తాను పనిచేస్తున్న చేపల చెరువు వద్దకు వచ్చి పూరింటి దూలానికి నూలుతాడుతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని సోదరుడు సాల్మన్‌రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ శంకరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుని మృతిపై దర్యాప్తు

ప్రజాశక్తి - భీమడోలు

ఆగడాలలంక గ్రామానికి చెందిన యువకుని మృతిపై దర్యాప్తు చేస్తున్నట్టు భీమడోలు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... ఆగడాలలంక గ్రామానికి చెందిన సైదు సాయికృష్ణగంగాప్రసాద్ శుకవారం రాత్రి 7:30 గంటల దాటిన తర్వాత గంగాప్రసాద్ తన స్నేహితుని రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆగడాలలంక నుంచి బైక్‌పై బయలుదేరి వెళ్లాడు. రాత్రి గడిచినప్పటికీ గంగా ప్రసాద్ ఇంటికి చేరుకోకపోవడంతో అతని తండ్రి కుమారుని ఆచూకీ కోసం ఫోను ద్వారా ప్రయత్నం చేశారు. శనివారం ఉదయం ఆగడాల లంక ఛానల్ రోడ్‌లోని వడ్డిగూడెం గ్రామంలో రోడ్డు పక్కన గంగాప్రసాద్ చనిపోయి ఉండటం స్థానికులు గమనించారు. ఏలూరు నుంచి ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో అతను ప్రయాణిస్తున్న మోటార్ సైకిల్ అదుపుతప్పి చెట్టుని ఢీకొని గంగా ప్రసాద్ ప్రమాదవశాస్తూ చనిపోయి ఉండొచ్చని, అతని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసిన భీమడోలు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


అధునాతన విద్యావిధానం 'శ్రీ వశిష్ట' లక్ష్యం

పాఠశాల చైర్‌పర్సన్ మనోహర్, డైరెక్టర్ శ్రీకాంత్, ప్రిన్సిపల్ విజయబాబు యాదవ్, సెక్రటరీ, కరస్పాండెంట్ మృణాళిని

ప్రజాశక్తి - నూజివీడు టౌన్



మనోహర్



శ్రీకాంత్



విజయబాబుయాదవ్



మృణాలిని

ఆధునిక పోటీ ప్రపంచంలో అధునాతనమైన విద్యను అందించటమే లక్ష్యంగా శ్రీ వశిష్ట ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రణాళికాబద్ధంగా ముందడుగులు వేస్తున్నట్లు పాఠశాల చైర్‌పర్సన్ పామర్తి మనోహర్, డైరెక్టర్ మరీదు శ్రీకాంత్, ప్రిన్సిపల్ కొణతం విజయబాబు యాదవ్, సెక్రటరీ, కరెస్పాండెంట్ పిఆర్‌కె.మృణాలిని తెలిపారు. జిల్లా పరిధిలోని రెవెన్యూ డివిజన్ కేంద్రమైన నూజివీడు పట్టణంలో శ్రీసత్యనారాయణ థియేటర్ ఎదుట 2025-26 విద్యా సంవత్సరం నుంచి శ్రీ వశిష్ట ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రారంభిస్తున్నారు. ఈ సందర్భంగా వారు ప్రజాశక్తితో మాట్లాడుతూ బట్టి పట్టే పాత విధానానికి స్వస్తి పలికి, పోటీ ప్రపంచంలో చిన్నారి విద్యార్థులు సైతం స్వశక్తితో విజేతలుగా నిలిచే విధంగా అధునాతనమైన విద్యను అందించనున్నట్లు తెలిపారు. ఉదయం ఐదు గంటలకు నిద్ర లేచింది మొదలు రాత్రి 10 గంటలకు పడుకునే వరకు చదివించడం, చూడకుండా రాయించడం ఇదేనా చదువు అంటే... ఈ విధానంతో చదువు యాంత్రికంగా మారడం వల్ల విద్యార్థులకు వారి బాల్యానికి ప్రతిబంధకంగా తయారవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పాత విధానాలకు, మూస ధోరణులకు తిలోదకాలిస్తూ వినూత్న రీతిలో విద్యార్థులు ఇష్టపడే విధంగా చదువును అందించనున్నట్లు తెలిపారు. ప్రధానంగా లెర్నింగ్ మెదడాలజీలో విద్యను అందించడానికి శ్రీ వశిష్ట ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవిర్భవించినట్లు వివరించారు. తమ పాఠశాల ద్వారా బట్టి పట్టించి చదివించటం అనేది ఎప్పటికీ ఉండదని స్పష్టం చేశారు. విద్యార్థులకు ఆడియో, వీడియో, ప్లే వే మెథడ్ ద్వారా విద్యాబోధన అందించనున్నట్లు తెలిపారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు అబాకస్, వేదిక్ మాథ్స్ ఒలంపియాడ్ ప్రోగ్రాం ఉంటుందన్నారు. అధునాతనమైన పద్ధతిలో కంప్యూటర్ విద్యాబోధన చేస్తామని చెప్పారు. విశాలమైన ఎయిర్ కండిషన్ క్లాస్ రూములు, విశాలమైన ఆటస్థలం ఆహ్లాదకరంగా సిద్ధం చేసినట్లు చెప్పారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఐఐటి, జెఇఇ, నీట్ ఫౌండేషన్ క్లాసులు నిర్వహించటం తమ ప్రత్యేకతగా వివరించారు.



విద్యార్థుల మానసిక ఉల్లాసానికి క్రీడలు, యోగా, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో విద్యార్థుల్లో చదువు పట్ల అమితాశక్తి పెంపొందిస్తామన్నారు. విద్యతో పాటు కాంపిటీషన్స్, థీమ్ బేస్డ్ యాక్టివిటీస్ నిర్వహిస్తామన్నారు. 15 ఏళ్ల అనుభవం కలిగిన నిష్ణాతులైన అధ్యాపకులతో విద్యార్థులకు సులువైన రీతిలో విద్యాబోధన అందించనున్నట్లు చెప్పారు. అన్ని రూట్లకు తమ విద్యాసంస్థ బస్సు సౌకర్యం కల్పించిందన్నారు. ప్రతివారం విద్యార్థులకు వీకెండ్ టెస్ట్ నిర్వహించి, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ప్రస్ఫూటం చేస్తామన్నారు. స్కూల్, తరగతి గదుల్లో ఇంగ్లీషులోనే మాట్లాడే విధంగా విద్యార్థులను తయారు చేయనున్నట్లు తెలిపారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించడం ద్వారా ప్రతిభావంతులుగా తయారు చేస్తామన్నారు. అధునాతనమైన ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, కంప్యూటర్ ల్యాబ్స్ విద్యార్థులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. గ్రూప్ డిస్కషన్ ద్వారా విద్యార్థులకు క్లాస్ రూమ్ ప్రజెంటేషన్ వంటి పద్ధతులతో సబ్జెక్టుపై పూర్తి అవగాహన కల్పించి, మరిచిపోకుండా జ్ఞాపకశక్తి పెంపొందించే విధంగా తీర్చిదిద్దుతామన్నారు. జీవితంలో క్రమశిక్షణ ఎంత ముఖ్యమో నేర్పించి మన దేశానికి ఆదర్శవంతులైన శాస్త్రవేత్తలుగా, డాక్టర్లుగా, ఇంజినీర్లుగా, ఉన్నత పదవులు అలంకరించే అధికారులుగా, గొప్ప పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడం తమ విద్యా సంస్థ ప్రణాళికగా తెలిపారు. భావి భారత పౌరులకు శ్రీ వశిష్ట ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఓ చక్కని పునాదిగా నిలిచి విద్యావ్యవస్థలో ఓ గొప్ప చరిత్ర సృష్టించబోతుందని తెలిపారు.

కాగుపాడు పిహెచ్‌సిలో నాణ్యమైన వైద్య సేవలు

దాతల సాయంతో కార్పొరేట్ తరహాలో ఆసుపత్రి భవనం

వైద్యురాలు పి.మానస

చిట్ చాట్

ప్రజాశక్తి - ఉంగుటూరు



కాగుపాడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నాణ్యమైన వైద్య సేవలే పరమావధిగా పనిచేస్తూ రాష్ట్ర వాప్తంగా గుర్తింపు పొందామని వైద్యురాలు పి.మానస అన్నారు. ప్రభుత్వ నిధులకు తోడు గ్రామస్తుల విరాళాల వల్ల కార్పొరేట్ ఆసుపత్రిని తలపించే విధంగా నిర్వహిస్తూ దాదాపు 17 గ్రామాల పేదలకు వైద్యసేవలందిస్తున్నామని ఆమె ప్రజాశక్తితో చిట్‌చాట్‌లో వెల్లడించారు.

ప్రశ్న : ప్రతిరోజూ ఒపి ఎలా ఉంటుంది, ఏయే వ్యాధిగ్రస్తులవారు ఎక్కువగా వస్తుంటారు?

వైద్యురాలు : కాగుపాడుతో పాటు దొంతవరం, పొట్టిపాడు, కాకర్లమూడి, బొమ్మిడి, రాచూరు, తోటరామచంద్రపురం, విఎపురం, ఉప్పాకపాడు, బొమ్మిడి, బాదంపూడి, నాచుగుంట, గుళ్లపాడు, యర్రమళ్ల, నీలాద్రిపురం, ఉంగుటూరు, రావులపర్రు, రాచూరు, సీతారామపురం గ్రామాలు కాగుపాడు పిహెచ్‌సి పరిధిలోకి వస్తాయి. ఆయా గ్రామాల నుంచి రోజుకు 60 నుంచి 70 వరకు రోగులు వస్తుంటారు. సాధారణ రుగ్మతలతో పాటు దీర్ఘకాలిక వ్యాధులవారు సైతం వస్తారు. మా పరిధిలో నయం కాని వారిని ఏలూరు, తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేస్తున్నాము.

ప్రశ్న : ఔషధాలు సరఫరా ఎలా ఉంటోంది?

వైద్యురాలు : ప్రతి మూడు నెలలకు (క్వార్టర్) ఇండెంట్ ప్రకారం ప్రభుత్వం ఔషధాలను సరఫరా చేస్తోంది. ఏడాదికి దాదాపు రూ.ఆరు లక్షలకు పైగా విలువైన ఔషధాలు వస్తున్నాయి. పాము కాటు, కుక్క కాటులకు సైతం సరిపడా మందులు, వ్యాక్సిన్ల నిల్వలు ఉన్నాయి. మందుల కొరత లేదు.

ప్రశ్న : ప్రస్తుతం దీర్ఘకాలిక వ్యాధులైన కేన్సర్, కిడ్ని రోగులు ఎంత మంది ఉంటారు?

వైద్యురాలు : పిహెచ్‌సి పరిధిలో 12 కేన్సర్, ఎనిమిది కిడ్ని కేసులు ఉన్నట్లు మా ఆరోగ్య కార్యకర్తల క్షేత్రస్థాయి పరిశీలనలో తెలిసింది. వారికి మా తరపున అన్ని సర్వీసులు అందిస్తున్నాం.

ప్రశ్న : స్టాఫ్ కొరత ఏమైనా ఉందా?

వైద్యురాలు : నాతో పాటు మరో మెడికల్ ఆఫీసర్ ఉన్నారు. ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఇద్దరు పిహెచ్‌ఎన్‌లు, సీనియర్ అసిస్టెంట్, ల్యాబ్ టెక్నిషియన్, సూపర్‌వైజర్లు, ఫార్మాసిస్ట్ ఉన్నారు. వాచ్‌మెన్ అండ్ శానిటరీ అటెండర్ గత మూడేళ్లుగా ఎలాంటి సమాచారం లేకుండా సెలవులో ఉన్నారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాము. వాచ్‌మెన్ అవసరం చాలా ఉంది. రాత్రుళ్లు డ్యూటీ చేసే మహిళా ఉద్యోగులకు వాచ్‌మెన్ లేకపోవడం కొంతవరకు ఇబ్బందిగానే ఉంది.

ప్రశ్న : కరోనా కేసులు బయటపడుతున్న క్రమంలో ముందస్తు చర్యలు ఏమైనా తీసుకున్నారా?

వైద్యురాలు : ఆరు బెడ్లు, ఆక్సిజన్ సిలెండర్, దాతలు సమకూర్చిన ఆక్సిజన్ కాన్‌సన్‌ట్రేటర్లు సిద్ధంగా ఉంచాం. సీజనల్ వైరల్ ఫీవర్లపై క్షేత్రస్థాయిలో ప్రతిరోజూ పర్యవేక్షణ, ఇంటింటా పర్యటన కార్యక్రమాలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. ఈ పిహెచ్‌సి ఉద్యోగులు జీతం కోసం కాకుండా బాధ్యతతో సేవా గుణంతో విధులు నిర్వహించడం తనకెంతో గర్వకారణంగా ఉంది. దానికి తోడు గ్రామస్తుల పూర్తి సహకారం నూటికి నూరుశాతం లభిస్తోంది. ఏ చిన్న అవసరం ఉన్నా ప్రభుత్వం మీద ఆధారపడకుండా దాతలే వనరులను సమకూర్చడం కాగుపాడు పిహెచ్‌సికి మరోఘనత.

ఉపాధి కూలీలకు పే స్లిప్పులు ఇవ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఉపాధి హామీ పనులు ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా కూలీలకు పే స్లిప్పులు ఇవ్వని ఉపాధి హామీ అధికారులు తక్షణమే ఇవ్వాలని వ్యవసాయ కార్మిక మండల కార్యదర్శి అందుకుల ప్రభాకరరావు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం నిర్వహించారు. సమావేశం మండల అధ్యక్షురాలు యాగంటి సీత అధ్యక్షతన జరగగా జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎ.ప్రభాకరరావు, ఎం.జీవరత్నం మాట్లాడుతూ ఎండల తీవ్రత దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ పనులు ఉదయం ఆరు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు చేయించాలని డిమాండ్ చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలని, వేతన బకాయిలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. తాగునీరు, మజ్జిగ, మెడికల్ కిట్లు, నీడకు టెంట్లు ప్రతి పని ప్రదేశాల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామ సచివాలయాలు, ఎంపిడిఒ కార్యాలయాలు ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని, అధికారులను హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం మండల కమిటీ సభ్యులు జె.సూర్యచంద్రం, కె.సుబ్బారావు, పిల్లి పోతురాజు, పులపాకుల వీర్రాజు, ఎం.బాలరాజు, పి.చంటి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

షైనింగ్ స్టార్ అవార్డుకు పలువురు ఎంపిక

ప్రజాశక్తి - ముసునూరు

మండల కేంద్రమైన ముసునూరు గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డు పొందారని ప్రిన్సిపల్ కె.లక్ష్మీకుమారి తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో తమ విద్యార్థులు కొప్పుల సాయి సింధు 578 మార్కులు, పి.సాహిత 571, ఐ.హిమబిందు 550 మార్కులు సాధించటంతో పాటు వివిధ పరీక్షల్లో ప్రతిభ కనబరిచారన్నారు. ఈ సందర్భంగా వారిని ప్రభుత్వం షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

చైతన్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థి షైనింగ్ స్టార్ స్టూడెంట్ అవార్డు దక్కించుకున్నాడు. మండలంలోని చెక్కపల్లిలో ఉన్న చైతన్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో చదివిన పదో తరగతి విద్యార్థి బొలుసు లీలాకృష్ణ షైనింగ్ స్టార్ స్టూడెంట్ అవార్డు పొందడంతో ప్రభుత్వం నుంచి రూ.20 వేల నగదు ప్రోత్సాహక బహుమతి అందించనున్నట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ నాగరాజు తెలిపారు.

ఉంగుటూరు : పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను షైనింగ్ స్టార్స్ అవార్డులకు ఉంగుటూరు మండలంలో ఐదుగురు ఎంపికయ్యారని ఎంఇఒ, ఏలూరు డివైఇఒ నిమ్మగడ్డ రవీంద్రభారతి తెలిపారు. వారిని ఈ నెల తొమ్మిదో తేదీన సత్కరించనున్నట్లు తెలిపారు. రూ.20 వేల నగదు, పతకం, సర్టిఫికెట్ అందిసనున్నట్లు చెప్పారు. గొల్లగూడెం శ్రీసూర్య స్కూల్ నుంచి సొంగ లాస్యజాహ్నవి, గౌతు పూజిత లక్ష్మీదుర్గ, ముళ్లపూడి నయన సాయి, నారాయణపురం ఉషోదయ స్కూల్ నుంచి పి.ఖ్యాతి సాయిశ్రీ, బాదంపూడి జెడ్‌పి హైస్కూల్ నుంచి సిరికి జస్వంత్‌లు ఎంపికయ్యారు.

పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

టి.నర్సాపురం: పామాయిల్ గెలలకు గిట్టుబాటు ధర కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో సిపిఎం మండల కమిటీ సమావేశం గుడెల్లి వెంకట్రావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎ.రవి మాట్లాడుతూ పామాయిల్ దిగుమతి సుంకం 50 శాతం పెంచాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ముడి పామాయిల్‌పై దిగుమతుల సుంకాన్ని 27.5 శాతం నుంచి 16.5 శాతం వరకు తగ్గించడం వల్ల పామాయిల్ గెలల ధర పడిపోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం స్వల్పంగా ధరలు పెంచి ఎన్నికల అనంతరం అమాంతం పామాయిల్ ధరలు కుదించి వేశాయని, ఇప్పుడు దిగుమతి సుంకం తగ్గించడం వల్ల పామాయిల్ రైతులు మరింత సంక్షోభంలో పడతారని వాపోయారు. దీంతో రైతులు నష్టాలను చూడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మడకం సుధారాణి, మండల కమిటీ సభ్యులు అనుమోలు మురళి, మడకం కుమారి, బరగడ కుమారి, శిరీష, సూర్యారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని శ్రీ మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో ప్రభంజనం సృష్టించినట్లు కెమిస్ట్రీ లెక్చరర్ టి.రత్నమణి తెలిపారు. కళాశాలలో శనివారం ఆమె మాట్లాడుతూ ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 80 శాతం, సెకండ్ ఇయర్‌లో 86 శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలో ప్రభుత్వ కళాశాల ప్రథమంగా నిలిచినట్లు చెప్పారు. ఎంపిసి ఫస్టియర్‌లో పివి.నాగలక్ష్మి 463, వి.కళ్యాణి 458, బైపిసిలో టి స్వర్ణ 435 సాధించినట్లు చెప్పారు.

నూజివీడు టౌన్ : ఇంటర్ ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో శ్రీ శారద జూనియర్ కళాశాల నూజివీడు విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి నూజివీడు డివిజన్‌లోనే మొదటి మూడు స్థానాలను కైవసం చేసుకున్నారని కళాశాల ఛైర్మన్ శంకరరావు, కరస్పాండెంట్ రాధిక తెలిపారు. జూనియర్ ఎంపిసి గ్రూపులో 465 మార్కులతో ఐదుగురు విద్యార్థులు వర్షిత, మౌనిక, తన్మయి, గాయత్రి, ప్రియాంక డివిజన్ ప్రథమ స్థానం సాధించారన్నారు. బైపిసి గ్రూపులో లలిత్య 435 మార్కులతో డివిజన్ ప్రథమ, శ్రీదేవి 433 మార్కులతో డివిజన్ మూడో స్థానంలో నిలిచారన్నారు. సిఇసి గ్రూపులో రిజ్వాన 480 మార్కులతో స్టేట్ ర్యాంక్ సాధించిందన్నారు. డి.పల్లవి 471 మార్కులతో డివిజన్ రెండో స్థానంలో, గౌతమి 468 మార్కులతో మూడో స్థానంలో నిలిచారని తెలిపారు.

దొంగనోట్ల ముఠాలో ప్రధాన నిందితుడు అరెస్టు

రూ.65 లక్షల విలువైన రూ.500 దొంగ నోట్లు, కారు, ఐ ఫోన్ స్వాధీనం

భీమడోలు : దొంగ నోట్ల మార్పిడికి పాల్పడుతున్న ముఠాలో ప్రధాన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ఒక కారు, రూ.65 లక్షలు విలువ చేసే రూ.500 దొంగ నోట్లు, ఒక ఐఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ భీమడోలు పోలీస్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించి వెల్లడించారు. ద్వారకాతిరుమల మండలం టి.లక్ష్మిపురం గ్రామానికి చెందిన కోడూరి రవితేజ ప్రస్తుతం జంగారెడ్డిగూడెంలో నివాసం ఉంటున్నాడు. తనతో పాటు షేక్ నాగూర్ మీరావలి, వీరంకి రాజేష్‌లను కలుపుకుని ముఠాగా ఏర్పడ్డారు. ఈ క్రమంలో ద్వారకాతిరుమలలో చిరు వ్యాపారం చేసుకుంటున్న కొల్లి సుబ్రహ్మణ్యం(సుధీర్)ను వారు కలిశారు. అసలు నోట్లకు ఆరు రెట్లు దొంగ నోట్లు ఇస్తామని సుధీర్‌ను ప్రలోభ పెట్టారు. ఈ మేరకు ఈ ఏడాది జనవరి రెండో తేదీన దొంగ నోట్ల మార్పిడి కోసం రూ.2.50 లక్షల ఒరిజినల్ నోట్లకు రూ.15 లక్షల నకిలీ నోట్లు మార్పిడి చేసేందుకు సుధీర్ సిద్ధమయ్యారు. ఈ క్రమంలో దొంగ నోట్ల మార్పిడి కోసం సుధీర్‌ను ముఠా సభ్యులైన నాగూర్ మీరావలి, వీరంకి రాజేష్ కలిశారు. సమాచారం అందుకున్న భీమడోలు ఎస్ఐ సుధీర్ దాడి చేసి దొంగ నోట్ల ముఠా సభ్యులు ఇద్దరితో పాటు, సుబ్రహ్మణ్యంను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ప్రధాన నిందితుడు కోడూరి రవితేజ పరారయ్యారు. దొంగ నోట్ల ముఠా గుట్టు రట్టు చేసేందుకు ఎస్‌పి ఆదేశాల మేరకు దర్యాప్తు అధికారిగా నియమితులైన భీమడోలు సిఐ, ద్వారకాతిరుమల మండలం ఎస్ఐతో పాటు, ఐడి పార్టీకి చెందిన కానిస్టేబుల్స్ శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు సహాయకులుగా దర్యాప్తు బృందంగా ఏర్పడ్డారు. కచ్చితమైన సమాచారం మేరకు వీరు శనివారం దొంగ నోట్ల కేసులో ప్రధాన నిందితుడిని అదుపులోనికి తీసుకున్నారు. విచారణలో ఇటీవల కాలంలో కోడూరి రవితేజ జంగారెడ్డిగూడెంలో కొన్ని బంగారు, వెండి వస్తువులు దొంగతనం చేసినట్లు తేలింది. సదరు సొమ్మును సైతం పోలీసులు సీజ్ చేశారు. ప్రధాన నిందితుడిని అదుపులోనికి తీసుకుని అతని వద్ద నుంచి కారు, దొంగనోట్లు, ఐ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

ఉపాధి కూలీల వేతనాలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఉపాధి హామీ కూలీలకు ఐదు వారాలుగా ఇవ్వాల్సిన ఉపాధి వేతనాలను వెంటనే విడుదల చేయాలని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని వంకవారిగూడెం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పని ప్రదేశానికి ఆయన శనివారం వెళ్లి కూలీలతో మాట్లాడారు. అనంతరం వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ రెండు నెలలుగా ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలకు వేతనాలు ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ కూలీల కడుపులు కాలుస్తుందని విమర్శించారు. తక్షణమే ఇప్పటివరకు బకాయి ఉన్న వేతనాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని, పే స్లిప్పులు ఇవ్వాలని, వేసవికాలంలో ఇచ్చే మజ్జిగ మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కారం నాగదుర్గ పాల్గొన్నారు.

సాంకేతిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని పరింపూడిలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు కె.రామచంద్రుడు, పి.లలితసుధ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆధునిక సాంకేతిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. నూతన వ్యవసాయ పరికరాలు, మెరుగైన సాగు పద్ధతుల గురించి రైతులకు వివరించారు.

యాత్రికులతో కిక్కిరిసిన శ్రీవారి ఆలయం

ద్వారకాతిరుమల : ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం శనివారం యాత్రికులలో కిక్కిరిసిపోయింది. స్కూల్స్ సెలవులు ముగిసి రీ ఓపెనింగ్ సమయం వస్తున్నందున మొక్కులు తీర్చుకునేందుకు పెద్దఎత్తున విద్యార్థులు, యాత్రికులు వచ్చారు. దర్శనం టికెట్లు, ప్రసాదం సేల్స్, రూములు, సేవలు కళ్యాణం డొనేషన్స్ రూపంలో సుమారు రూ.43 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్‌విఎస్ఎన్.మూర్తి యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. అన్నదానంలో యాత్రికులతో మాట్లాడి అన్న ప్రసాదం నాణ్యత, ఏర్పాట్లు తదితర విషయాలపై అడిగి తెలుసుకున్నారు. క్యూలైన్లో ఉన్నవారికి మజ్జిగ, తాగునీరు అందించారు. విఐపి దర్శనాలు రద్దుచేసి యాత్రికులకు త్వరగా దర్శనం అయ్యేటట్లు ఇఒ పర్యవేక్షించారు.